ప్రజాశక్తి

గురువారం 20 మార్చి 2025 | 5 | విజయనగరం

పాముకాటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పకీరుకిత్తలి పంచాయతీ పరిధిలోని బుర్రిపేటకు చెందిన ద్వారపూడి మౌనిక (17) పాముకాటుతో మంగళవారం రాత్రి మృతి చెందింది. రాత్రి తన ఇంటి వద్ద పాముకాటేయడంతో తండ్రి రాము, కుటుంబ సభ్యులతో కలిసి ఆమెను వెంటనే విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తనిఖీలు చేసిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మౌనిక మరణ వార్తతో గ్రామంలో విషాదం అలుముకుంది. మౌనిక నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవలే పరీక్షలు రాసింది. గుర్ల ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌనిక (ఫైల్)

పల్లెపండగ నిధులతో వేసిన రోడ్డు

ఊరూరా తిరిగి ఓట్లు దండుకోవడాలు... పదవులు, ఆ పేరుతో అధికార లాంఛనాలపై ఉన్న యావ జిల్లా అభివృద్ధి, నిధులు సద్వినియోగం వంటి వాటిపై కనిపించడం లేదు మన పాలకులకు, ప్రభుత్వానికి. దీంతో, జిల్లాలో ఖర్చుచేయడానికి అవకాశం ఉన్న రూ.271కోట్లు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా మన జిల్లా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు ఎప్పటి మాదిరిగా మాటలు గారడిగానే మిగిలిపోయాయి. ఉపాధి పనుల ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు, వాటి వినియోగం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

- నిరుపయోగంగా రూ.271.05 కోట్లు
- మెటీరియల్ కాంపొనెంట్ నిధులను వినియోగించుకోలేని దుస్థితి
- అధికారుల ఆత్రుత అంతంతమాత్రమే

పదవులపై ఉన్న యావ..పనులపై ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై కూలీలకు చెల్లించే వేతన మొత్తంలో 40శాతం మేర మెటీరియల్ కాంపొనెంట్ కింద జనరేట్ అవుతాయి. ఈ మొత్తాన్ని కూలీలతోపాటు యంత్రాలకు కూడా ఉపయోగించి జిల్లాలోని రోడ్లు, కాలువలు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలకు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయవచ్చు. ఈ లెక్కన మన జిల్లాలో జనవరి వరకు కూలీలకు చెల్లించిన రూ.386.42 కోట్లపై మెటీరియ్ కాంపొనెంట్ నిధులు రూ.257.61కోట్ల మేర జనరేట్ అయ్యాయి. జనవరి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు జరిగిన పనులపై మరో రూ.172.72 కోట్ల వరకు విడుదల అయ్యే అవకాశం ఉంది. మొత్తంగా రూ.430.33 కోట్ల మేర కాంపొనెంట్ నిధులు ఉన్నట్టు లెక్క. కానీ, ఇందులో కేవలం రూ.159.28 కోట్ల విలువైన పనులు మాత్రమే జిల్లాలో చేపట్టారు. ఇందులోనూ ఇప్పటి వరకు రూ.84.86కోట్ల మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.72.42కోట్లకు బిల్లులు అప్‌లోడ్ చేశామని, నిధులు ఇంకా విడుదల కావాల్సివుందని డ్వామా అధికారులు చెబుతున్నారు. ఈ బకాయి సంగతి పక్కన బెడితే, ఇంకా సుమారు రూ.271.05 కోట్లు మిగిలివుంది. ఈ నిధుల వినియోగానికి ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కాలపరిమితి మరో 11రోజుల్లో ముగియనుంది. ఈనేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా వచ్చిన మొత్తం రూ.430.33కోట్లలో రూ.271.05 కోట్లు నిరుపయోగమైనట్టే లెక్క అని సాక్షాత్తు పంచాయతీరాజ్, డ్వామా శాఖల్లోని అధికారులే విశ్లేషిస్తున్నారు.

వాస్తవానికి ఈ నిధుల వినియోగంలో అధికారుల శ్రద్ధ కన్నా ప్రజాప్రతినిధుల పాత్రే అత్యంత కీలకంగా ఉంటుంది. ఎందుకంటే నిధులు వినియోగించుకోవాలనే శ్రద్ధ పంచాయతీరాజ్ శాఖ మంత్రికి, జిల్లాకు చెందిన మంత్రికి ఉండాలి. అలాగే జనరేట్ అయిన నిధులు తమ మండలం లేదా నియోజకవర్గానికి కేటాయించాలనే డిమాండ్ ఎమ్మెల్యేలు, లేదా జెడ్‌పిటిసిలు, ఎంపిపిల నుంచి రావాల్సివుంది. పంచాయతీరాజ్ శాఖకు సాక్షాత్తు జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ శ్రద్ధ చూపలేదు. జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం కూడా దాదాపు లేదు. ఇక ప్రతిపక్షంలోవున్న వైసిపి ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులకు వెండార్‌గా అవకాశం కల్పించాలని జిల్లా పరిషత్ సమావేశంలో గలాటా సృష్టించినప్పటికీ నిధుల కోసం ప్రభుత్వాన్ని అధికారులను నిలదీయలేదు. దీంతో, జిల్లాలో వినియోగించుకోవాల్సిన కోట్లాది రూపాయలు నిరుపయోగంగా మిగిలి పోయాయి. గత ప్రభుత్వం చేపట్టి గ్రామ, వార్డు సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, బల్కుమిల్ సెంటర్ల తదితర భవన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

ఆస్పత్రి వద్ద మృత శిశువును పట్టుకొని బైఠాయించిన బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు

వైద్యుల నిర్లక్ష్యం..శిశువు మరణం

- విషాదంలో గిరిజన కుటుంబం
- ఆస్పత్రి వద్ద నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ శిశువు మృతి చెందింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన శాంతి ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరింది. గర్భిణీగా ఉండగా గతంలో పలుమార్లు ఆమె భర్త అరుణ్ తో కలసి ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంది. స్కానింగ్ అవసరమంటే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చేయించు కున్నారు. బుధవారం గర్భిణీకి కాన్పు చేస్తామని చెప్పడంతో ఆ కుటుంబం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండిపోయింది. ఇందులో భాగంగా ఆమెకు వైద్య పరీక్షలు చేసి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పడంతో సంతోషించారు. అయితే ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. శాంతికి కాన్పు చేస్తున్న సమయంలో ఆడబిడ్డ పుట్టి చనిపోయింది. ఈ విషయం వైద్యులు బాధిత కుటుంబానికి తెలిపారు. అయితే కాన్పుకు కొన్ని గంటల ముందు వరకు తల్లీ బిడ్డ బాగున్నారని చెప్పిన వైద్యులు కాన్పులో బిడ్డ చనిపోయిందని చెప్పడంతో ఆ గురిజన కుటుంబం ఆవేదంలో మునిగిపోయారు. కేవలం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయిందని తండ్రి అరుణ్ కన్నీరుమున్నీరయ్యాడు. అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి బయట బైఠాయించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైద్యాధికారి నీలను వివరణ కోరగా గర్భంలో ఉన్న శిశువు మెడకు పేగులు చుట్టుకోవడం వల్ల గుండె ఆగిపోయిందని, దానివల్ల శిశువు మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

- దాతల సహకారంతో హాస్టళ్ల మరమ్మతులు
- తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ యశస్వి

ప్రజాశక్తి-విజయనగరం

బిసి కార్పొరేషన్ రుణాలకు ఈనెల 22వ తేదీలోగా పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవాలని తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బిసి రుణాలపై జిల్లా బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఛైర్‌పర్సన్ యశస్వి మాట్లాడుతూ, బిసిల్లో పేదలకు ఈ పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. దాదాపు 145 రకాల యూనిట్లకు ప్రభుత్వం సబ్సిడీని, బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యూనిట్లను స్థాపించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ రుణాల పట్ల నాయకులు, కార్యకర్తలు అర్హులకు అవగాహన కల్పించి, దరఖాస్తు చేయించాలని సూచించారు. దాతల సహకారంతో బిసి హాస్టళ్లను మరమ్మతు చేయించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు మాట్లాడుతూ, బిసి రుణాలకు దరఖాస్తు చేసుకొనే విధానం, అర్హతలు, బిసి సంక్షేమశాఖ కార్యకలాపాలు, హాస్టళ్ల స్థితిగతులు, టైలరింగ్ శిక్షణ, ఎపి బిసి స్టడీసర్కిల్ శిక్షణా కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య, క్షత్రియ, రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, ఎసి కాపు వర్గాలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. సమావేశంలో ఎబిసిడబ్ల్యూఒలు ఎం.యశోధనరావు, బి.రాజులమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల కొనుగోలుకు మూడు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో రైతుల నుంచి పెసలు, మినుములు కొనుగోలు చెసే నిమిత్తం మూడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేన వెంకటేశ్వర రావు తెలిపారు. జామి మండలం విజినిగిరి, గంట్యాడలో రైతు సేవా కేంద్రం, గజపతినగరం పిఎసిఎస్‌లో ఈ కేంద్రాలను బుధవారం తెరిచినట్లు వెల్లడించారు. రైతులు తాము పండించే పెసలు, మినుములు వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా శుభ్ర పరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాల మేరకు తమ ఉత్పత్తులు వుండేలా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. రబీ సీజన్ – 2024 సంవత్సరంలో పండించే పెసలు మినుములు మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ఇ – క్రాప్ చేయించుకున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను సిఎం – యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

జెడ్‌పి చైర్మన్‌కు పుత్ర వియోగం

పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రణీత్

వైసిపి విజయనగరం జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన చిన్న కుమారుడు మజ్జి ప్రణీత్ (20) సుమారు ఐదేళ్లపాటు మృత్యువుతో పోరాడి బుధవారం మృతి చెందాడు. 2020 మే 4న విజయనగరంలోని ధర్మపురి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితికి చేరుకున్నాడు. నాటి నుంచి మృత్యువుతో పోరాడిన ప్రణీత్ బుధవారం విశాఖపట్నంలోని స్టార్ పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ప్రణీత్ మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం ధర్మపురిలోని చిన్నశ్రీను స్వగృహానికి తీసుకువచ్చారు. తోటపాలెం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, చిన్న శ్రీను అభిమానులు అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, అధికారులు, కార్యకర్తలు చిన్న శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. అంతిమ యాత్రలో ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పల నాయుడు, బొత్సఅప్పల నరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కంబాల జోగులు, బొడ్డేటి ప్రసాద్, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్ పరామర్శ

చిన్న శ్రీను కుమారుడు ప్రణీత్ మరణం పట్ల మాజీ సిఎం, వైసిపి జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఫోన్ ద్వారా చిన్న శ్రీనును పరామర్శించారు. కుమారుని మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జెడ్‌పి చైర్మన్‌ను పరామర్శించేందుకు వచ్చిన వైసిపి నాయకులు

బాల్య వివాహాలు, బాలకార్మికులు తగ్గాలి

డ్రాపౌట్స్, కర్మాగారాల్లో పని చేస్తున్న బాలికలను గుర్తించాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతుమాధవన్

మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామ స్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒక సారి సమావేశం నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్ గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్.జి.ఓ లు, ఆరోగ్య వర్కర్స్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామ స్థాయి సమావేశాల్లో అనాధ పిల్లల్ని, స్కూల్ డ్రాప్ ఔట్స్ ను, గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, డ్రగ్స్, దోపిడీ తదితర అంశాల పై చర్చించాలని అన్నారు. బాలల హక్కుల సంరక్షణ పై అవగాహనా సదస్సులు నిర్వహించాలని, నైపుణ్య శిక్షణలు, కెరీర్ కౌన్సిలింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహించి పునరావాసం కల్పించాలని తెలిపారు. గ్రామ స్థాయి లో నిర్వహించిన కమిటీలో చర్చించిన అంశాలను జిల్లా స్థాయి కమిటీ కి పంపించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి లో పరిష్కారం లభించని వాటికీ జిల్లా స్థాయి లో చర్చించి తగు పరిష్కారం చూపిస్తామన్నారు. జిల్లా స్థాయి లో ప్రతి నెల కమిటీ సమావేశం జరుగుతుందని, అదే విధంగా మండల స్థాయి, మున్సిపల్ స్థాయి సమావేశాలలో కూడా బాలల హక్కుల పై చర్చ జరగాలని అన్నారు డ్రాప్ ఔట్ అయిన బాలికలను గుర్తించి డ్రాప్ ఔట్ కు గల కారణాలను విశ్లేషించాలని డిఇఒకు తెలిపారు. కర్మాగారాలు, హోటళ్లలో పనిచేసే బాలికలను గుర్తించాలని లేబర్ కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ ఇంఛార్జి పీడీ ప్రసన్న, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిసిపిఒ లక్ష్మి, డిఎస్‌పి, తదితరులు పాల్గొన్నారు.

సిటియులో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ సంయుక్తంగా కెమిస్ట్రీ విభాగం 'మాలిక్యూల్స్ టు మెటీరియల్స్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు.కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ అధ్యక్ష ప్రసంగం చేస్తూ, ఆవిష్కరణ, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. రసాయనిక శాస్త్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలను ఎక్కువగా అందించే విభాగమని, నేడు మెటీరియల్ సైన్స్ పైనే ప్రపంచం ఆధార పడి ఉందని తెలిపారు. రాబోయే రోజులలో ఇది ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, నానో టెక్నాలజీ లతో కలసి ప్రపంచాన్ని శాసించే విధంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ చీఫ్ ఎడిటర్, బెంగళూరు లోగల ఇండియన్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్.నటరాజన్ ప్రొఫెసర్ బాలాజీ ఆర్. జాగీర్దార్, కెఆర్ ప్రసాద్ పలు అంశాలపై ప్రసంగించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ముక్కామల శరత్‌చంద్రబాబు, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్చుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్‌చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పూల్‌బాగ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారి పట్ల ఎవరైనా అనుచితంగా గాని, అసభ్యంగా గాని ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు లేదా టీచర్లకు తెలియజేయాలని సూచించారు. బాల బాలికలకు న్యాయవ్యవస్థ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. బాలల హక్కులను కాపాడడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. బాలబాలికలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వారి పట్ల కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి బి. అప్పలస్వామి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్, ఎంఇఒ పి. సత్యవతి, మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ పి.ఫర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్‌చక్రవర్తి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

రహదారి పక్కన పడి ఉన్న మృతదేహాలు

మండలంలోని కోరపు కొత్తవలస సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడెందొరవలసకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఎస్.బూర్జివలస స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టబోను లక్ష్మణరావు (23), ఆవాల రాము (55) ద్విచక్ర వాహనంపై రామభద్రపురంవైపు వెళ్తుండగా, పార్వతీపురం నుండి విజయనగరం వైపు వస్తున్న లగేజ్ పార్సిల్ వ్యాన్ వీరి బైకును ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాము, లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతితో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకొంది. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ ట్రూఆప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం పూల్‌బాగ్ కాలనీ, కణపాకలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు పి.రమణమ్మ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెబుతూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. వెంటనే ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామలక్ష్మి, విజయ, గురయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 94 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 94 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు మొత్తం 22,834 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 22,740 మంది హాజరయ్యారని, 94 మంది గైర్హాజరయ్యారని డిఇఒ మాణిక్యంనాయుడు తెలిపారు.

జిల్లాలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ 10 వ తరగతి పరీక్షలలో బుధవారం ఇంగ్లీష్ పరీక్ష సజావుగా జరిగిందని తెలిపారు. ఈ పరీక్షకు 488 మందికి గాను 440 మంది హాజరయ్యారని, 48 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆర్‌టిసి డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బడి బస్సుల కోసం విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో అవసరమున్నచోట్ల విద్యార్థులకు బడి బస్సులు నడపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు బుధవారం మయూరి జంక్షన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసి డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు బడి బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా బడి బస్సులు సంఖ్య పెంచాలని, టైమ్‌కు పాఠశాలలకు, కళాశాలలకు చేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న విధంగా విజయనగరం నుంచి రణస్థలం వరకు, విజయనగరం నుంచి సతివాడ వరకు, విజయనగరం నుంచి కుమిలి వరకు బడి బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శిరీష , సోమేష్ , పట్టణ కమిటీ సభ్యులు శివ , గుణ, జయ, లక్ష్మి, పాల్గొన్నారు.

హైమాస్ట్ విద్యుత్ దీపాలు ప్రారంభం

విజయనగరం టౌన్ : అంబటిసత్రం జంక్షన్ వద్ద 1 లక్షా 25 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన హై మోస్ట్ విద్యుత్ దీపాలను నగర మేయర్ వి.విజయలక్ష్మి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఇఇ టి. రాయల్ బాబు, డిఇ ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణరాజు

వయోజనులకు అక్షరాస్యత పరీక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వయోజనులకు అక్షరాస్యత పరీక్ష నిర్వస్తున్నట్లు ఎంపిడిఒ కె. రామకృష్ణ రాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో వయోజనులైన అక్ష్యరాస్యులకు ఈ నెల 23న జరగనున్న ఫౌండేషన్ లీటరసి, న్యూమరసి ఎసెస్మెంట్ టెస్ట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చదవడం, రాయడం, లెక్కలు వేయడం నేర్చుకున్న వయోజనులకు వారి పురోగతిపై 23న పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షలు ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో జరుగుతాయని పాసైన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ధ్రువీకరణ పత్రం అందజేస్తుందని తెలిపారు. ఉల్లాస్ శిక్షణా కేంద్రాల ద్వారా శిక్షణ పొందుతున్న వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు బి.శారద, త్రినాధమ్మ, విఒఎలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలను తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంఇఒ పి.బాలభాస్కర్ రావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రెండో రోజు హనుమాన్ జాతర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాంలో హనుమాన్ జాతర బుధవారం రెండో రోజు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామలక్ష్మి దంపతులు, మాజీ సర్పంచ్ జనపరెడ్డి ఈశ్వరమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆర్‌టిసి సిబ్బంది

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్‌గా పని చేసి అనారోగ్యంతో ఇటీవల మరణించిన మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన బి. పోలారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. పిల్లలు చిన్న వారు కావడంతో ఇంటి పెద్ద పోలారావు కాలం చేసినందున కుటుంబానికి ఆర్థికంగా సాయ పడాలనే సదుద్దేశ్యంతో డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో డిపో సిబ్బంది అందరిని సమావేశ పరచి తనతో సహ సిబ్బంది అందరితో కలిసి రూ.60వేలు సేకరించి పోస్ట్ ఆఫీస్‌లో పోలారావు పిల్లల పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేయించి బాండ్‌లు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం అందజేశారు. ఈ సహాయం చేసిన బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, ఆన్ కాల్ డ్రైవర్లు, గ్రౌండ్ బుకింగ్ సిబ్బంది, సెక్యూరిటీ, గ్యారేజ్, ఆఫీస్, పొరుగు సేవలు, ట్రాఫిక్ సిబ్బందకి డిపో మేనేజర్ ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆర్‌టిసి జోనల్ కమిటీ పిలుపు మేరకు జోన్‌లో ఉన్న సమస్యలపై విజయనగరం ఈడితో జరిగిన చర్చలు విఫలం కావడంతో బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ ఎస్‌కోట డిపో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో సెక్రెటరీ రాజయ్య, కార్మికులు పాల్గొన్నారు.

సింగరాయిలో గ్రామ సభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయిలో బుధవారం 18వ విడత సామాజిక తనికీలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల గురించి సామాజిక తనిఖీలో ఆరా తీశారు. సర్పంచ్ ఎన్ వెంకటరావు అధ్యక్షతన జరిగి సభలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్, క్షేత్ర సహాయకుడు పాల్గొన్నారు.

రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

తనిఖీ చేస్తున్న అధికారి

పట్టణంలోని ఆకుల డిపో వద్ద గల రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో బుధవారం జిల్లా ఆహార భద్రత అధికారి షేక్ నాగూర్‌మీర తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత తనిఖీల్లో భాగంగా పట్టణంలోని కిరాణా షాపులతో పాటు రిలయన్స్ స్మార్ట్ బజార్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఇటీవల కాలంలో పచ్చి శెనగపప్పు, పెసరపప్పు, కందిపప్పు ఎక్కువగా కల్తీకి గురవుతున్నాయని అందులో భాగంగా పట్టణంలో గల ఈ రిలయన్స్ స్మార్ట్ బజార్లో కూడా ఆహార పదార్థాలను తనిఖీ చేశామని అన్నారు. అందులో భాగంగా పచ్చి సెనగపప్పును శాంపిల్స్‌గా తీసుకున్నామన్నారు. చిన్నచిన్న షాపులపై ఏవిధంగా దాడులు నిర్వహిస్తామో పెద్దపెద్ద మాల్స్‌పై కూడా అదే విధంగా దాడులను చేసి ఆహార భద్రత పరిశీలిస్తామన్నారు. రిలయన్స్ స్మార్ట్ బజార్లో సేకరించిన శనగపప్పు శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని నాచారం లేబరేటరీకి పంపిస్తామని తెలిపారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగారాయపురం రాముల వారి ఆలయానికి అదే గ్రామానికి చెందిన గేదెల సీతారాం ఆరు తులాల బంగారం విరాళంగా అందించారు. మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావుకు బుధవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కరెడ్ల ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో సీతారాముల ఆలయం అభివృద్ధిలో భాగంగా విరాళం స్వీకరించామన్నారు. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి ఆలయాభివృద్ధి కృషి చేస్తామన్నారు. అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అవసమరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గేదెల సీతారాం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

లక్కవరపుకోట ప్రధాని రహదారిలో బుధవారం ఎఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను పాత కేసుల బకాయిలను వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్‌లకు వాహనదారులు సహకరించాలని కోరారు. పాత కేసులు ఉన్నా వారిని రికవరీ చేయించారు.

1న భగత్‌సింగ్ వర్థంతి సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చే నెల 1న నిర్వహించే భగత్ సింగ్ 94వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఒ నాయకులు ఎం.అప్పలరాజు, బి.గిరిప్రసాద్ కోరారు. బుధవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రిటిష్ సామ్రాజువాదల దోపిడీపై పోరాడి చిరునవ్వుతో ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖేదేవ్ వర్ధంతి సందర్భంగా ఏప్రిల్ 1న మంగళవారం ప్రెస్ క్లబ్‌లో సభ నిర్వహిస్తామని తెలిపారు.

బకాయిల మాటేమిటి : పిఆర్‌టియు

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయుల బదిలీల చట్టం తేవడం మంచిదేనని, అయితే ఉపాధ్యాయుల బకాయిల మాటేమిటో ప్రభుత్వం చెప్పాలని పిఆర్‌టియు జిల్లా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాయుడు, డి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో మున్సిపల్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీల చట్టం చెయ్యడం వలన ఉపాధ్యాయులకు సౌలభ్యం కలిగినప్పటికీ రావలసిన ఆర్థిక బకాయిలు వేలల్లో ఉన్నాయని, వాటిని చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తాము దాచుకున్న పిఎఫ్ డబ్బులు పొందలేకపోవడం ఉద్యోగులను వేదనకు గురిచేస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది అవుతున్నా ఉద్యోగులకు ఎటువంటి మేలూ జరగలేదన్నారు. పాఠశాలల మూతే ధ్యేయంగా కనిపిస్తోందన్నారు.

పోరాట ఫలితమే మారిక రోడ్డు

ప్రజాశక్తి - వేపాడ

పోరాట ఫలితంగా మారిక రోడ్డు నిర్మాణం జరుగుతుందని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గత రెండు రోజులుగా మారిక గ్రామంలో బస చేసిన సిపిఎం నాయకులు అక్కడ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మారిక గ్రామని రోడ్డు కావాలని, నాడు ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేయడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుయ్యాయని గుర్తు చేసుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాటాడుతూ 2013, 2017, 2021, 2025 సంవత్సరాల్లో రోడ్డు కోసం ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన, వంటావార్పు, ఆఫీస్ నిర్బంధం వంటి విరోచిత పోరాటం చేశామని, మన పోరాటానికి జిల్లా కలెక్టర్ అంబేద్కర్ చొరవతో రూ.7కోట్లు కేటాయించడమే కాకుండా గతంలో మిగిలిపోయిన రోడ్డును కూడా వేయించేందుకు కలెక్టర్ తీసుకున్న చొరవ ప్రశంసనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల అలిత కుమారి గిరిజనులకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఎంపిడిఒ ఇతర మండల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాత నిధులతో మిగిలిపోయిన రోడ్డు, కొత్తగా ఏడు కోట్లతో నిర్మించడాని మంజూరైన రోడ్డు, రెండూ ఒకేసారి నిర్మాణం చేపట్టడం చాలా సంతోషమని చెప్పారు. రోడ్డు నిర్మాణం ఇదే స్పీడ్‌తో వర్షాకాలం లోపే పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు చాలుమూరి శ్యామ్, కిలో ఆనంద్, గమ్మెల రామకృష్ణ, బాబురావు, అప్పలనాయుడు, ఆసు, అర్జున్, వెంకటరావు లింగరాజు, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు జగన్

మరుపల్లిలో మంచినీటికి తంటాలు

గజపతినగరం : సిపిఎం పార్టీ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని మరుపల్లి గ్రామ సమస్యలపై సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సుంకర గణేష్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి లక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందించారు. ముఖ్యంగా గ్రామంలో మంచినీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇంటింటి కొళాయిలు లేక పనులకు వెళ్లడానికి ఆటంకంగా మారుతుందని చెప్పారు. సమృద్ధిగా నీరు సరఫరా కావడం లేదని, ఎత్తు ప్రాంతంలో ఉన్న వారికి నీటికి ఇబ్బంది కలుగుతుందని అన్నారు. డి పట్టా భూములున్నవారికి భూదార్ అనుసంధానం విధానం వల్ల భవిష్యత్తులో రైతు సంక్షేమ పథకాలకు దూరమవుతారని అందువల్ల భూదార్ విధానం ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాలం కంపెనీ మూతపడడంతో యువకులకు ఉపాధి కరువైందన్నారు. యువతీ యువకులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాస్, పి సింహాచలం, చంటి, పి.వెంకటలక్ష్మి, నరవ దుర్గ, రాములమ్మ పాల్గొన్నారు.



గజపతినగరం: వినతిపత్రాన్నిస్తున్నసిపిఎం నాయకులు, గ్రామస్తులు

కార్మికుడు మృతి బాధాకరం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని బొత్సవానివలస బెల్లం క్రషర్‌లో పని చేయడానికి వచ్చిన కార్మికుడు ఇటీవల విద్యుత్తు షాక్‌తో చనిపోవడం చాలా బాధాకరమని, క్రషర్ యాజమాన్యం టైంతో సంబంధం లేకుండా పని చేయించడం ఇటువంటి చావులకు ఒక కారణమని సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. బుధవారం ఆయన క్రషర్‌కు వెల్లే విద్యుత్తు తీగలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బొత్సవానివలస గ్రామ సమీపంలో బెల్లం క్రషర్‌లో పనిచేయడానికి వేపాడ మండలం దబ్బిరాజుపేట గ్రామానికి చెందిన వ్యక్తి వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవడం దారుణమన్నారు. ప్రాణం పోవడం ఒకటైతే ప్రాణం పోయిన తర్వాత రెవెన్యూ అధికారులు పంచనామ ఇవ్వకుండా వైద్యాధికారులు పోస్టుమార్టం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విద్యుత్ తీగలు అంతా కిందకు జారి పడటానికి విద్యుత్ శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం అన్యాయమన్నారు. గతంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యానికి పూడివలస గ్రామంలో ఇద్దరు వ్యవసాయ కూలీలు చనిపోయినట్లు ఆయన గుర్తు చేశారు. అయినా సరే విద్యుత్ శాఖ అధికారులు తీరు ఏమాత్రం మారేటట్లు కనిపించడం లేదన్నారు. ఎటువంటి అనుమతులూ లేని క్రసర్లను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

భూముల్లోకి వెళ్లేలా సర్వీస్ రోడ్డు వేయండి

- విమానాశ్రయ రహదారికి ఇరువైపులా వేస్తున్న ఇనుపు కంచె పనులు నిలిపివేయాలి
- ఆర్‌డిఒను కోరిన నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో రైతులకు సర్వీస్ రోడ్డును ఇవ్వాలని నాయకులతో పాటు రైతులంతా ఆర్‌డిఒ దాట్ల కీర్తిని కోరారు. ప్రస్తుతం రైతులు పొలాల్లోకి వెళ్లకుండా వేస్తున్న కంచెను సైతం నిలిపివేయాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ స్పందించి ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. అంతవరకు కంచెను వేయకుండా నిలిపివేయాలని జిఎంఆర్ సిబ్బందికి ఆర్‌డిఒ ఆదేశాలు ఇచ్చారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రోడ్డులో రైతులు తమ పొలాల్లోకి వెళ్లకుండా అడ్డంగా ఇనుప కంచెను వేస్తున్నారు. ఇనుప కంచె వేస్తే పొలాల్లోకి వెళ్ళేది ఎలా అంటూ గత నెల 27వ తేదీన ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వెలువడింది. దీంతో రైతులు మేల్కొని ఇటీవలి జిల్లా కలెక్టర్‌ను ఈ సమస్యపై కలిశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ విమానాశ్రయ రహదారిని పరిశీలించేందుకు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయ రహదారికి భూములిస్తే తమ భూములకు విలువ పెరుగుతుందని రైతులంతా భూములు ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు అదే రైతులు తమ పొలాల్లోకి వెళ్ళకుండా కంచె వేయడం వల్ల చాలా ఇబ్బందులు పడతామన్నారు. అందుకు ఖచ్చితంగా సర్వీస్ రహదారి ఇవ్వాలని కోరారు. రహదారి వేసేటప్పుడు చెరువును కప్పకుండా వేస్తామని గతంలో చెప్పి ఇప్పుడు ఏకంగా చెరువును కప్పేస్తున్నారని ఏ రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి తెలిపారు. ఈ చెరువు వ్యవహారంలో జిఎంఆర్ హెడ్ రామరాజుకు శివారెడ్డికి మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. రావివలస జంక్షన్ నుంచి కంచేరు వరకు వంద అడుగులకు రహదారికి ఇదివరకే భూ సేకరణ చేశారని ఆ రోడ్డును వెడల్పు చేస్తే బాగుంటుందని జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆర్‌డిఒను కోరారు. వేసవి కాలం కావడంతో గాలికి మట్టి ఎగిరి గ్రామాలపైకి వస్తుందని దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గాలికి మట్టి ఎగరకుండా తడపమని చెప్పి ఎన్నిసార్లు చెబుతున్నా సరే జిఎంఆర్ సంస్థ పట్టించుకోవడంలేదని అయ్యప్ప రెడ్డితో పాటు నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, యర్రప్పల నారాయణ ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. మట్టిని నీటితో తడుపుతామని జిఎంఆర్ సంస్థ రామరాజు హామీ ఇచ్చారు. గూడెపువలస సమీపంలోని ఉన్న ఆలయాలపై మట్టి పడకుండా ఆలయం చుట్టు 20 అడుగుల ఎత్తున రేకులు వేస్తామని తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : ఆర్‌డిఒ

'మీరు నా దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను శుక్రవారం జరిగే సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి నేను తీసుకెళ్తా' అని ఆర్‌డిఒ కీర్తి తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, జిఎంఆర్ సంస్థ హెడ్

ఈ రహదారి వెంబడి ఇనప కంచె వేయడం వల్ల ఎంతమంది రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందో వివరాలు సేకరించి నివేదిక ఇస్తామన్నారు. రైతులు సహకరించడం వల్లనే ఇంతవరకు విమానాశ్రయం పనులు వేగవంతరంగా జరుగుతున్నాయని అందుకు రైతులను ఇబ్బంది పెట్టబోమని చెప్పారు. తహశీల్దార్ ఎమ్.సురేష్, సవరవల్లి సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్ రెడ్డి, దల్లిపేట మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు, జిఎంఆర్ సంస్థ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - బొబ్బిలి

లీకులను నివారించి మున్సిపల్ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేస్తామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. కౌన్సిలర్లతో కలిసి బుధవారం భోజరాజపురం మున్సిపల్ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని వారు పరిశీలించారు. నీటి నిల్వలు, ఇంఫిల్టర్ బావులు, నీటి సంపులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంపు హౌస్ నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ పురాతనమైనది కావడంతో ఎక్కడికక్కడే లీకవ్వడంతో తాగునీరు వృధాగా పోతుందన్నారు. లీకులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో కొంతమంది మోటర్లతో నీరు తోడి వాటర్ ట్యాంకులకు ఎక్కిస్తున్నారని, వాటిని కంట్రోల్ చేయాలని మున్సిపల్ ఎఇలను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో పని చేస్తున్న సిబ్బంది సక్రమంగా పని చేయకపోవడం వల్ల తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తతున్నాయని చెప్పారు. సక్రమంగా పని చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడైపోయిన మోటర్లను బాగు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తికి చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

భోజరాజపురం వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్ జెఇ రుక్మాంగద నాయుడు చెప్పారు. భోజరాజపురం వంతెన వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ భోజరాజపురం వంతెన నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరైందని, ఇప్పటి వరకు రూ.5కోట్లు పనులు చేయగా గత ప్రభుత్వం రూ.2కోట్లు బిల్లులు మంజూరు చేసిందని చెప్పారు. వంతెనకు రెండు వైపులా రెండు కిలోమీటర్లు మేరకు అప్రోచ్ రోడ్డు వస్తుందన్నారు. వంతెనకు ఒకవైపు గొర్లె సీతారాంపురం జంక్షన్ వరకు, మరో వైపు రామభద్రపురం మండలం నాయుడువలస వరకు అప్రోచ్ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ పంపు హౌస్ స్థలం 8 సెంట్లు పడినట్లు మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికు జెఇ రుక్మాంగద నాయుడు చెప్పారు. ఆ స్థలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ప్రహరీ గేటు తొలగించాల్సి ఉందని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్, గేటు తొలగింపు ప్రతిపాదనలు పంపిస్తే కౌన్సిల్ ఆమోదం తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి చెప్పారు.

ముడిసరుకు సరఫరా చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన బొబ్బిలి వీణలు తయారీకి ముడి సరుకు సరఫరా చేసి అధునాతన టూల్ కిట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. బొబ్బిలి వీణల తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలను బుధవారం అసెంబ్లీలో ఆయన ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బొబ్బిలి వీణలకు ప్రపంచంలోనే మంచి ఖ్యాతి వచ్చిందని, వీణలను పనస కర్రతో చేస్తారన్నారు. అటవీ ప్రాంతాలు నాశనం కావడంతో పనస కర్ర దొరకడం లేదన్నారు. పనస కర్ర కొరతతో వీణల తయారీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీణల తయారీకి పనస మొక్కలను పెంచుతామని రాష్ట్ర మంత్రి ప్రకటించారని, ఒక చెట్టు పెరిగేందుకు 25 సంవత్సరాలు పడుతుందన్నారు. వీణల తయారీదారులు ఇబ్బందులు పడకుండా కేరళ, తమిళనాడు, ఒడిషా రాష్ట్రాల నుంచి పనస కర్రలను కొనుగోలు చేసి సరఫరా చేయాలని, ఆధునాతన టూల్ కిట్స్ అందించాలని కోరారు. బొబ్బిలిలో రోడ్డు పక్కన వీణల షోరూమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

'సీతం'లో ముగిసిన సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎంప్లాయిబిలిటీ, సాఫ్ట్ స్కిల్స్‌పై వారం రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. నాంది ఫౌండేషన్, మహీంద్రా ప్రైడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిక్షకులు కె.గౌతమ్ శంకర్, వై.హరి కుమార్ వ్యవహించారు. వీరు విద్యార్థులకు అనేక విషయాలను బోధించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో నిర్వహించారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పనులు చేస్తున్న కూలీలు

మెరకముడిదాం: మండలంలోని బైరిపురం చింతవీధి, బ్రాహ్మణ వీధులకు సంబంధించిన తాగునీటి పైపు మరమ్మ తులకు గురికావడంతో సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ప్రజలకు మంచి నీరు సరఫరా అంతరాయం రాకుండా ఉండేందుకు వెంటనే చర్యలు తీసుకున్నట్లు వారు చెప్పారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి బాలికల వసతి గృహంలో 2025 -26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కిరణ్మయి అన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94,91334174, 7901098532కు ఫోన్ చేయాలన్నారు.

మెరకముడిదాం: స్థానిక కెజిబివిలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కెజిబివి ప్రిన్సిపాల్ గౌశ్యా బేగం తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నెల్లిమర్ల: సతివాడ ఎపి మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హెచ్.శైలజ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి ప్రవేశం కోరే అభ్యర్థులు పదో తరగతి స్టడీ సర్టిఫికెట్, హాల్ టికెట్, కుల ధ్రువ పత్రం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు జతపర్చాలని, బిసి, ఒబిసిలకు 200 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలకు 150 రూపాయలు పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. ఈ నెల 17 నుంచి వచ్చేనెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 10వతరగతి మార్కులు, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని ఇతర సమాచారం కోసం ఫోన్ నెంబర్ 8121845319, 7702937355, 9866956432 సంప్రదించాలని ఆమె తెలిపారు.

IN THE HONOUERABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM AS: 65/2024

Between:
Kasam Usha .....Appellant
AND:
Chelluru Kalyan Chakravarthi ....Respondent.

Notice To:
Chelluru Kalyan Chakravarthi, S/o. Appala Ramulu, aged about 38 years, Basiness, residing at Ayyanapeta village, Vizianagaram District.

ఇందలి అప్పీలెంట్ దిగివ కోర్టు వారు ఇచ్చిన తీర్పును రద్దు పరచమని కోరుచూ, దాఖలు చేసిన అప్పీల్లో పలు పర్యాయాలు మీకు నోటీసులు పంపినప్పటికీ అమలు జరగలేదు. శ్రీ కోర్టు వారు పేపర్ మూలకంగా నోటీసు జారీ చేస్తూ తేదీ 04-04-2025 దిన వాయిదా అయిఉన్నది. కాబట్టి మీరు పై కోర్టు ఎదుట **తేదీ 04-04-2025 దిన ఉదయం 10:30 గంటలకు** మీరు స్వయంగా గాని మీ తరపున లాయర్ గారు ద్వారా గాని మీ ఆక్షేపణలు దస్త్రాలు దాఖలు చేయవలెను. లేనిచో ఉన్న ఆధారాలు మేరకు మీ పైన పరోక్షంగా తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయమనేది.

బై కోర్టు ఆర్డర్.

S. NAGESWARA RAO (NAGU)
ADVOCATE,
VT Agraharam, Vizianagaram,
Cell 9440562141, 9848405337

పంటల వివరాలపై సర్వే చేయాలి

డిపిఎం స్వామి నాయుడు

ప్రజాశక్తి- రేగిడి

మాట్లాడుతున్న డిపిఎం స్వామినాయుడు

గ్రామ సమైక్య సభ్యులు ఖరీఫ్ వ్యవసాయానికి వ్యవసాయ క్షేత్రాల్లో సాగు విస్తరణ, పంట వివరాలు సర్వే తప్పక చేయాలని ఎపి సిఎన్ఎఫ్ సంస్థ అడిషనల్, విజయనగరం జిల్లా డిపిఎం, ఎపి స్వామి నాయుడు, పిఐఐసిటి గుంటూరుకు చెందిన కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘాల సభ్యులు, సీసీలు, ఎంఎంఎస్ సంఘం ప్రతినిధులతో యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సంఘాల సభ్యులు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సర్వే, పిఎండిఎస్ కిట్లు శత శాతం పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో సాగు విస్తరణ, పంట వివరాలు ముందుగా సర్వే చేయాలన్నారు. ప్రతి రైతును కలసి పంట పొలాల్లో వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయ అసిస్టెంట్లతో పంటల దిగుబడిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సర్వే వివరాలు గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఋతుపవనాలు రాకముందు వేసే పంటలు, వాటి ప్రయోజనాలు రైతులకు వివరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీరితోపాటు ఎపిఎం బాసిన గోవిందరావు, ఎన్ఎస్ఎంటి పద్మ, కోఆర్డినేటర్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందని ఎపి సిఎన్ఎఫ్ ఎడిఎ ప్రకాశరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం పై వ్యవసాయ శాఖ, వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలతో కన్వెర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపి సిఎన్ఎఫ్ ఎడిఎ ప్రకాశరావు, ఆర్‌టిఒ హేమసుందర్ మాట్లాడుతూ విషపూరిత ఎరువులు వినియోగం వల్ల భూమి సారవంతం కోల్పోయి మానవాళి భయంకరమైన రోగాల బారిన పడుతున్నారన్నారు. నేల సారాన్ని, వ్యవసాయాన్ని రక్షించుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. దీనిలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించి నవ ధాన్యాల సాగుకుకి ముందుకు రావాలన్నారు. నేల సారవంతానికి పచ్చి రొట్ట విత్తనాలు, వానపాము సాగు చేయాలన్నారు. రైతుల్ని ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఒ ఎం.పూర్ణిమ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బంగారమ్మ, ఎపిఎం లు ఎస్‌విడి సురేష్, ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కొండపాలెం

వేలం కం టెండరు నోటీసు

రేఖా నెం.09/2025 తే.24-03-2025

విజయనగరం జిల్లా, గరివిడి మండలం, కొండపాలెం (గరివిడి) గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ వ్రాయబడిన 2025-2026 సంవత్సరమునకు మార్కెట్ వేలం మరియు టెండర్లు ద్వారా గుత్తకిచ్చుటకు తే.24-03-2025ది. వరకు టెండర్లు స్వీకరించబడును, మరియు ఉదయం 11:00 గంటల నుండి 1:00 (ఒంటి గంటకు) వరకు ఈ దిగువ సంతకందారునిచే వారి అనుమతి పొందిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయంలో రోజు వారి మార్కెట్ బహిరంగ వేలం పాట చేయబడును. వేలం పాట మరియు టెండర్లులలో పాల్గొనదలచినవారు ఆయా గంటలకు ఈ క్రింది విధంగా చూపబడిన ధరావతులు ముందుగా చెల్లించి ఫలం మరియు టెండర్లులలో పాల్గొనవలెను మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్లు ముందుగా దాఖలు చేయవలెను. వేలం నిబంధనలను పాటించి వేలంపాట మరియు టెండర్లలో పాల్గొనవలెను.

వ.సం	వేలం వివరములు	లీజు కాలం	దరావత్తు	సాల్వెన్సీ విలువ
1	రోజు వారి మార్కెట్లు	2025-2026	20,000/-	100,000/-

టెండర్లు :

1) 28 మంది కాంట్రాక్ట్ స్వీపర్లును సప్లై చేయుటకు 2025-2026 రూ.5000/-
2) 11 మంది మంచినీటి పని వారును సప్లై చేయుటకు 2025-2026 రూ.1000/-
3) వీధిలైట్లు బాగు చేయుటకు, స్తంభం ఎక్కి కట్టుటకు (01) ఒక్కరిని సప్లైయి చేయుటకు గాను 2025-2026 రూ.500/-
4) పారిశుధ్యపు ట్రాక్టరు నడుపుటకు (03) ముగ్గురు సప్లై చేయుటకు 2025-2026 రూ. 500/-
5) పారిశుద్ధ్యపు పవర్ ఆటో(వాన్స్) నడుపుటకు (02) ఇద్దరు సప్లైయి చేయుటకు 2025-2026 రూ. 500/-
6) ప్రజారోగ్య సామానులు మరియు మందులు సప్లైయి చేయుటకు 2025-2026 రూ. 1000/-

పై వాటిని సప్లైయి చేయుటకు తే 24-03-2025 దిన మధ్యాహ్నం 1-00 (ఒంటి గంట నుండి సాయంత్రం 4-00 గంటల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తీసుకోగలరు. అదే రోజు సాయంత్రం 4-00 గంటల వరకు రాని టెండరు ధరావత్తు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. ఇతర వివరముల కొరకు కార్యాలయంలో సంప్రదించగలరు.

షరతులు: 1) టెండర్లులలో ఒకటవ ఐటమ్ 28 మంది కాంట్రాక్టు స్వీపర్లకు కొబ్బరి నూనె, సబ్బులు - సదరు తక్కువ రేటు గల టెండరు దారుడు సప్లైయి చేయవలెను.

గమనిక: 1) వేలములు, టెండర్లు ఏ విధమైన కారణం చేత రద్దు పరచే అధికారం ఈ గ్రామ పంచాయతీ వారికి కలదు. 2) ఏ విధమైన విషయమైనా గ్రామపంచాయతీ పని వేళల్లో మాత్రమే తెలుసుకోగలరు. 3) శ్రీ కలెక్టర్ సం॥ విభాగం వారి ఉత్తర్వులు లోబడి.

(సం//) పచ్చిపిల్లి ప్రమీల
సర్పంచ్
గ్రామ పంచాయతీ కొండపాలెం.

(సం//) యస్.నాగమణి
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ కొండపాలెం.